ప్రజాశక్తి

ఆదివారం 22 జూన్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

భూ సమీకరణపై మలివిడత గ్రామసభలు

అధికారికంగా విడుదలకాని నోటిఫికేషన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని విస్తరణలో భాగంగా మలివిడత భూ సమీకరణకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. రెండో విడత భూ సమీకరణకు 44 వేల ఎకరాలకు సమీకరించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే తొలి విడత అమరావతి మండలంలో గ్రామసభలను పూర్తి చేశారు. మలివిడత తాడికొండ మండలంలో గ్రామసభలు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం తాడికొండ మండలం మోతడక, లచ్చన్నగుడిపూడి, తుళ్లూరు మండలం నెక్కలులో గ్రామస్తులతో అభిప్రాయ సేకరణ చేయనున్నారు.



అమరావతి మండలంలో గ్రామ సభలకు హాజరైన రైతులు (ఫైల్)

రాజధాని నిర్మాణంలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాలకు అదనంగా మరో 44 వేల ఎకరాలను కూడా రెండో విడతలో సమీకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయించారు. అయితే రాజధాని ఏర్పడినప్పుడు తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో ఎంపిక చేసిన 29 గ్రామాల్లో చాలా వరకు భూముల ధరలు తక్కువగా ఉన్నాయి. మెట్టప్రాంతంలో ఎకరం రూ.20 లక్షలు, జరీబు గ్రామాల్లో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి. రాజధాని అమరావతి వచ్చిన తరువాత చుట్టుపక్కల మండలాల్లో ధరలు భారీగా పెరిగాయి. ప్రధానంగా అమరావతి, తాడికొండ, క్రోసూరు, అచ్చంపేట, సత్తెనపల్లి, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, చేబ్రోలు తదితర మండలాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. ఎకరం రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పెరిగాయి.

ఈ నేపథ్యంలో రెండో విడత భూ సమీకరణలో తాము భూములిస్తే మొదటి విడత రైతులకు ఇచ్చిన ప్యాకేజినే తమకు ఇస్తే తమకు నష్టమని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా తాడికొండ, అమరావతి, పెదకాకాని తదితర మండలాల వారు సమీకరణలో భూములు తీసుకుంటే తమకు ప్యాకేజి పెంచాలని డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎటువంటి స్పష్టమైన ప్రకటన రాలేదు. సమీకరణపై కూడా అధికారికంగా నోటిఫికేషన్ రాలేదు. మంత్రి నారాయణ మాత్రం 44 వేల ఎకరాల సమీకరణ ఉంటుందని ఇందులో 24 వేల ఎకరాలకు సంబంధించిన రైతులు తమ సానుకూలత వ్యక్తం చేసినట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెండో విడత

▶ 2లో



తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మాట ఇచ్చారు.. కొనుగోలు కేంద్రం పెట్టండి..

- పెదనందిపాడులో కొనకుంటే రైతులకు ఇబ్బందులు
- వ్యవసాయ శాఖ మంత్రి హామీని విస్మరించి మోసం చేయొద్దు
- తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రైతుల ధర్నా

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో రైతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు అధ్యక్షత వహించగా రామారావు మాట్లాడుతూ ఈ నెల 10 నుండి పెదనందిపాడులో పొగాకు కొనుగోలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. పొగాకు కొనేవారు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇటీవల బాపట్ల జిల్లాలో ఇద్దరు, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పుసులూరులో ఒకరు, పల్నాడు జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. గత మూడేళ్లుగా మంచి దిగుబడి, ధర రావడంతో గతంలో చేసిన అప్పులు తీర్చుకునే ఉద్దేశంతో ఈ ఏడాది ఎక్కువ మంది సన్న చిన్నకారు రైతులు నల్ల బర్లీ, తెల్ల బర్లీ పొగాకును పెదనందిపాడు మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో కలిపి సుమారు 11 వేల ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. సీజన్ మొదట్లో పొగాకు కొనుగోలు చేసే అనేక కంపెనీల ప్రతినిధులు గ్రామాల్లో తిరిగి రైతులకు హామీ ఇచ్చి పొగాకు సాగును ప్రోత్సహించారని, మంచి రేటు వస్తుందంటూ కొంతమందికి బాండ్లు కూడా ఇచ్చారని చెప్పారు. పంట చేతికొచ్చే సమయానికి వాంతా కనిపించకుండా పోయారని, రోజులు గడిచే కొద్ది పొగాకు రంగు మారుతోందని, పొగాకును నిల్వ చేసుకునే వీల్లేక రైతులు దిగాలు పడ్డారని వివరించారు. కొద్దిమంది రైతుల వద్ద పొగాకు కొనుగోలు చేసిన కంపెనీల వారు

▶ 2లో

వారం రోజుల్లో నష్టపరిహారం

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాద బాధిత రైతుల అంశంపై సబ్‌కలెక్టర్ సమావేశం


2లో

బుగ్గవాగు రిజర్వాయర్‌లో మొసలి!

ప్రజాశక్తి - దుర్గి



మండలంలోని బుగ్గ వాగు రిజర్వాయర్ మొసలి సంచరిసోంది. దీన్ని మేకల కాపర్లు ఇటీవలే గమనించిన గ్రామస్తులు పెద్దగా పట్టించుకోలేదు. శనివారం పలువురు మీడియా ప్రతినిధులు వెళ్లి పరిశీలించగా మొసలి కనిపించింది. జీవాలు, గేదెల పెంపకందార్లు బుగ్గవాగు రిజర్వాయర్లలో దిగుతుంటారు. జీవాలకూ అక్కడే నీరు పెడుతుంటారు. ప్రస్తుతం రిజర్వాయర్ చుట్టుపక్కల ప్రాంతాలకు ఎవరూ వెళ్లవద్దని గ్రామస్తులు సూచిస్తున్నారు. బుగ్గ వాగు రిజర్వాయర్‌ను నిర్మించి 50 ఏళ్లయినా గతంలో ఎప్పుడూ మొసళ్ల సంచారం కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటలేస్తే మద్దతు ధర ఇస్తారా?

- పొగాకుకు క్రాప్‌హాలిడే ఇస్తే ఏ పంటలు వేయాలో స్పష్టతివ్వాలి
- ఆత్మహత్య చేసుకున్న కౌల్దార్ల పొగాకు ఇంకా పొలాల్లోనే
- కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి - యడ్లపాడు

ఈ ఏడాది పొగాకుకు క్రాప్ హాలిడే ఇచ్చి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని చెబుతున్న ప్రభుత్వం, అధికారులు ఏ పంటలు వేయాలో చెప్పాలని, వాటికి మద్దతు ధరపైనా గ్యారెంటీ ఇవ్వాలని రైతుసంగం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మైదవోలు-వంకాయలపాడు పరిధిలోని స్పైసెస్ పార్కులోని ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పొగాకు నాణ్యత ప్రకారంగా ధర నిర్ణయిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఎగువ, మధ్యస్యంగా ఉన్న వాటికి రూ.12 వేలు, దిగువ రకానికి రూ.6 వేలు చెల్లిస్తామని తెలిపిందని ఇది రైతులకు ఇబ్బందని చెప్పారు. ఈ సాకులేమీ లేకుండా పొగాకు మొత్తాన్నీ పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. గతేడాది రైతులు అత్యధికంగా పొగాకు వేయడానికి ప్రధాన కారణం కంపెనీలే అనే విషయాన్ని గుర్తించాలని, విత్తనాలు, నార్లు ఇస్తామని, తామే కొనుగోలు చేస్తామని రైతులను ప్రోత్సహించి తీరా ఉత్పత్తులు చేతికొచ్చాకా సిండికేట్ అయి కొనుగోళ్లు అపేశారని చెప్పారు. పొగాకు సాగు చేయవద్దని చెప్పే అధికారులు ముందుగా కంపెనీల ప్రతినిధులు విత్తనాలు, నారు సిద్ధం చేసి రైతుల్ని

▶ 2లో





గుంటూరు, నరసరావుపేటలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజల ఆరోగ్యం కోసం యోగా శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా


ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం యోగాంధ్ర ద్వారా యోగాసనాలపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, పి.అరుణ్‌బాబు చెప్పారు. గుంటూరు పల్నాడు జిల్లాల్లో శనివారం యోగాడే నిర్వహించగా ఇందులో భాగంగా గుంటూరులోని పోలీస్‌పరేడ్ మైదానంలో కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, నగరపాలక సంస్థ మేయర్ కె.రవీంద్ర, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, రాష్ట ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ హాజరయ్యారు.పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద పరేడ్‌గ్రౌండ్‌లో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎస్‌పి కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు, డిఆర్‌ఒ మురళి హాజరయ్యారు. గుంటూరులో జిల్లా అధికారులు, యోగా శిక్షకులు, మాస్టర్ ట్రైనర్స్, విద్యార్థులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, ప్రజలు దాదాపు 5000 మందితో యోగాసనాలు వేయించారు. జిల్లాలో 5130 ప్రాంతాల్లో యోగాసనాలు కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ నాగలక్ష్మి

▶ 2లో

మోతడక, లచ్చనగుడిపూడి గ్రామాల్లో నేడు గ్రామసభలు

ప్రజాశక్తి - తాడికొండ

రాజధానికి అదనపు భూసమీకరణ కోసం మండలంలోని మోతడక, లచ్చనగుడిపూడి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటలకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలు జరుగుతాయని, గ్రామస్తులందరు హజరవ్వాలని కోరారు.



తహశీల్ధార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

మాట ఇచ్చారు.. కొనుగోలు కేంద్రం పెట్టండి..

(మొదటి పేజీ తరువాయి)

డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అప్పు చేసి పంట పండించిన రైతులు కూలీలకు, అప్పు తెచ్చిన దగ్గర డబ్బులు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతుల అవుసరాన్ని గుర్తించకుండా ఎక్కడో గుంటూరు, మైదవోలు, పర్చూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పొగాకు తీసుకురావాలని చెప్పడం రైతుల్ని ఇబ్బందులకు గురిచేయడమేనని అన్నారు. గోడౌన్లు లేవని కుంటి సాకులు చెప్పి పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు నిరాకరించడం రైతుల్ని మోసం చేయడమేనని విమర్శించారు. రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకటశివరావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రం పెదనందిపాడులో ఏర్పాటు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్ట పోతారని అన్నారు. అనంతరం తహశీల్ధార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యంను కలిసి రైతుల ఇబ్బందులను వివరించగా పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, ఎన్.రాజేంద్ర, పి.భువనేశ్వరి, ఎం.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసం యోగా శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. యోగా శిక్షణ కోసం గురువులు, మాస్టర్ ట్రైనర్స్, ట్రైనర్స్‌ను గ్రామ, సచివాలయ స్థాయిలో దాదాపు 5000 మందిని తయారు చేసి, ఎనిమిది లక్షల మంది ప్రజలకు మూడ్రోజులు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం కవాతు మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిప్యూటీ మేయరు సజీలా, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ జ్యోతి బసు, జిల్లా పంచాయితీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పల్నాడులో 5 వేల వేదికల వద్ద దాదాపు 5 లక్షల మందితో యోగా చేపట్టినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. నెల రోజుల పాటూ జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర యాప్ ద్వారా 9.97 లక్షల మందిని నమోదు చేశామన్నారు. నెల రోజులుగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న శిక్షకులను సత్కరించి, జిల్లాలో నిర్వహించిన యోగా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం స్తూపం సమీపంలో మొక్కను నాటి ప్రతిజ్ఞ చేయించారు.

ప్రత్యామ్నాయ పంటలేస్తే మద్దతు ధర ఇస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను కంపెనీలు ప్రోత్సహిస్తే ఆ బాధ్యతను కంపెనీ వాళ్లే తీసుకునేలా ప్రభుత్వం చూడాలన్నారు. అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని స్థానిక ధరలను నిర్ణయించి, రైతులకు భరోసా కల్పించాలని కోరారు. టుబాకో బోర్డు మన రాష్ట్రంలోనే ఉన్నందున, ఇతర రాష్ట్రాలపై వాదనలు అనవసరమన్నారు. తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల పొగాకు పొలాల్లోనే మండెలరూపంలో నిల్వ ఉందని, ఆ నిల్వమొత్తాన్ని వెంటనే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వారం రోజుల్లో నష్టపరిహారం

- శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాద బాధిత రైతుల అంశంపై సబ్ కలెక్టర్ సమావేశం
- తమకూ పరిహారం ఇవ్వాలని కోరుతూ వ్యాపారుల వినతి

ప్రజాశక్తి దుగ్గిరాల

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పసుపుపంట నిల్వ చేసి అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు వారం రోజుల్లో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెనాలి సబ్ కలెక్టర్ అంజనా సిన్హా తెలిపారు. నష్టపరిహారం చెల్లించేందుకు ఏర్పాటు చేసిన కమిటీతో సబ్‌కలెక్టర్ స్థానిక మార్కెట్ యార్డులో శనివారం సమావేశమయ్యారు. శుక్రవారం ఏర్పాటైన ఈ కమిటీలో సబ్ కలెక్టర్, మార్కెటింగ్ ఏడీ, యార్డు సెక్రెటరీ, ఇన్సూరెన్స్ కంపెనీ సభ్యులు, కోల్డ్ స్టోరేజ్ యజమాని సభ్యులుగా ఉంటారు. ఇప్పటివరకు బీమా కంపెనీ నుండి రూ.35 కోట్ల 47 లక్షల నష్టపరిహారం సెకండ్ స్టేజికి వచ్చిందన్నారు. మిగిలిన మొత్తం కోసం ప్రయత్నిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. రైతులకు చెందిన 468 బాండ్లు వచ్చాయని, అందులో ఎన్ని బస్తాలు ఉన్నాయి అనేది అంచనా వేయాల్సి ఉందని చెప్పారు. ఇదిలా ఉండగా నష్టపరిహారాన్ని తమకూ ఇవ్వాలని సబ్‌కలెక్టర్‌కు వ్యాపారులు విన్నవించారు. దీనికి ఆమె స్పందిస్తూ ఈ అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, బీమా మొత్తం వచ్చాక నిర్ణయిస్తామని అన్నారు.



వినతిపత్రం ఇచ్చిన వ్యాపారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

'సుపరిపాలన - తొలి అడుగు' ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో సోమవారం నిర్వహించనున్న 'సుపరిపాలన - తొలి అడుగు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు శనివారమూ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ప్లానింగ్ శాఖ జాయింట్ సెక్రెటరీ అనంత శంకర్, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ , అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవికుమార్, అడిషనల్ ఎస్పీ ఇంటిలిజెన్స్ (పొలిటికల్) ఖాదర్ బాష, ఎస్ఎస్‌జి అడిషనల్ ఎస్పీ రమణ, సిఎంఒ ప్రోగ్రాం కో-ఆర్డినేషన్ టీమ్ సభ్యులు దినీష్, రఘు, ఇక్బాల్ తదితరులు సభ జరిగే ప్రదేశాన్ని సందర్శించారు. సభా స్థలి ఏర్పాటు, గ్యాలరీల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాల్లో పనులు, సీటింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, సీఆర్డీఏ సీఈ ధనుంజయ్, ఆర్ అండ్ ఈఈ విశ్వనాధ్‌రెడ్డి, ఎపిసిపిడిసిఎల్ ఈఈ సంజీవ్ రావు, జెడ్‌పి సిఇఓ జ్యోతిబసు, తహశీల్ధార్ సుజాత , డిఎస్పీ మురళీక్రిష్ణ పాల్గొన్నారు.



సిబిఆర్ పోస్టల్ కవర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి

సిబిఆర్ స్పోర్ట్స్ అకాడమీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా స్థానిక కొత్తపేట ప్రధాన తపాలా కార్యాలయంలో సిబిఆర్ పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు దర్శకులు దిలీప్ రాజా అధ్యక్షత వహించారు. పోస్టల్ ప్రత్యేక కవర్ను ఇన్కమ్ టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ డికె రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది సైనికులకు దక్కిన అరుదైన గౌరవమని వెల్లడించారు. సిబిఆర్ వంటి సైనికులు ఎందరో దేశ రక్షణ కోసం పాటుపడ్డారని, అంతే కాకుండా సిబిఆర్ సమాజానికి సేవలందించి పలువురికి స్ఫూర్తినిచ్చారని అన్నారు. ఇదే సభలో సీనియర్ పాత్రికేయుడు బిఎల్ నారాయణ రాసిన 'సైనికుడు సేవకుడు' పుస్తకం తుది రూపుదిద్దుకున్న సందర్భంగా ఆయనను సభ వేదికపై ప్రముఖులు సత్కరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ రెడ్డి, అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి, కర్నూల్ రాంబాబు, పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసులు, సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్ష కార్యదర్శులు మోటూరి శంకరరావు, అయినంపూడి రత్న ప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రధాన తపాలా కార్యాలయం పోస్టుమాస్టర్ నాగేశ్వరరావు, పలువురు మాజీ సైనికులు, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న చలసాని బాబు రాజేంద్రప్రసాద్, డికె.రావు తదితరులు

ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని హిందూకళాశాల జంక్షన్ నుంచి బస్టాండ్‌కు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు డీకొని మహిళ దుర్మరణం పాలైన ఘటన శనివారం పాతబస్టాండ్ వద్ద జరిగింది. ఆర్ఎస్ బ్రదర్స్ వద్ద రోడ్డు దాటుతున్న నరహరి శైలజ (53) ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కంకరగుంట వద్ద అపార్టుమెంట్‌లో నివసించే ఆమె షాపింగ్ పని నిమిత్తం పాత బస్టాండ్ ప్రాంతానికి రాగా రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈస్టు ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమీకరణపై మలివిడత గ్రామసభలు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామసభలపై ఇంకా కొంత సందిగ్ధత కొనసాగుతోంది.

రాజధాని అమరావతిలో 2015లో చేసిన భూ సమీకరణ పరిధి 217 చదరపు కిలో మీటర్లు వరకే ఉన్నాయి. భూ సమీకరణ పరిధిని పెంచేందుకు అసెంబ్లీలో సిఆర్‌డిఎ నిబంధనలను సవరించే తీర్మానంను ఆమోదించాల్సి ఉందని, ఆ తరువాత అధికారిక ప్రకటన ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. మలివిడత భూ సమీకరణలపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని దాదాపు నాలుగు మండలాల్లోని 20 గ్రామాల్లో భూ సమీకరణకు సన్నాహాలు ఇప్పటికే జరుగుతున్నాయి. రాజధానికి సమీపంలో ఉన్న మండలాల్లో రోడ్డు పక్కన భూములకు అధిక ధరలు ఉండటం, లోపల భూములకు తక్కువ ధరలు ఉండటం వల్ల ఇద్దరికీ ఒకే ప్యాకేజి ఎలా అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. తమకు కూడా 29 గ్రామాల పరిధిలోనే రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని, కౌలు తక్షణం రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్‌లు తెరపైకి తెచ్చారు. ప్రధానంగా అమరావతి రైల్వే లైను, 2500 ఎకరాల్లో స్పోర్ట్సు సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, పారిశ్రామిక వేత్తలకు పెట్టుబడి పెట్టేందుకు తక్కువ ధరకు భూములు ఇచ్చేందుకు వీలుగా రెండో విడత సమీకరణకు సన్నద్ధం అవుతున్నట్టు తెలిసింది.

కంటిపొర ఉచిత చికిత్స శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని శ్రీ భద్రావతి సమేత భావనఋషి స్వామి వార్ల దేవస్థానం పరిధిలో గల దామర నాంచారమ్మ ప్రాంగణ మండపంలో చిల్లపల్లి అమరయ్య సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు చిల్లపల్లి నాగతిరుమలరావు ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ ఎంఇఎస్‌యు పుట్టపర్తి సంయుక్త ఆధ్వర్యంలో వారంరోజులపాటు కొనసాగే శనివారం కంటి పొర చికిత్స ఉచిత శిబిరాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఆప్కో మజీ చైర్మన్ గంజి చిరంజీవి, టిడిపి బిసి సెల్ నాయకులు గుత్తికొండ ధనంజయరావు, పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం సభ్యులు హాజరై మాట్లాడారు. అమెరికాలో నివసిస్తున్నప్పటికీ తిరుమలరావు తండ్రి చిల్లపల్లి అమరయ్యపై ఉన్న గౌరవాన్ని, ఈ దేశంలోని పేదల పట్ల వారికున్న సేవా దృక్పథాన్ని ప్రతిబింబించే విధంగా ఈ ట్రస్టు స్థాపించడం గర్వకారణమని అన్నారు.



చికిత్స శిబిరం పాల్గొన్న వైద్యులు, ప్రజా ప్రతినిధులు



జాబ్ మేళాకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న శాంతిబాయి

23న జాబ్ మేళా

ప్రజాశక్తి - వెల్దుర్తి

వరల్డ్ వెల్ బీయింగ్ (డబ్ల్యూడబ్ల్యూబి) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు ఎస్‌కేబిఆం కాలేజీలో ప్రారంభించనున్న మెగా జాబ్ మేళాకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, అక్కిరెడ్డి హాజరవు తారని ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సాంబేలు శాంతి బాయి తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి యువతను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందు ఉంటారని వారి ఆదర్శంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ ప్రతిష్టాత్మమైన 15 కంపెనీల ద్వారా 1000కి పైగా ఉద్యోగాల భర్తీ జరగనుంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. 23వ తారీకు సోమవారం ఉదయం 9:00 కల్లా అభ్యర్థులు తమ విద్యార్హతల జిరాక్స్‌లు రెజ్యూమ్‌తో రావాలని తెలియజేశారు. 9885398475 అనే నెంబర్‌కి కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.



అక్బర్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సయ్యద్ అక్బర్ సేవలు ఆదర్శమని ఆ పాఠశాల ప్రధా నోపాధ్యాయులు కాకాని వెంకటరమణ అన్నారు. శనివారం పాఠశాలలోని హాకీ క్రీడాకారులు 20 మందికి, వాలీబాల్ ప్లేయర్స్‌కు 20 మందికి కావలసిన యూనిఫామ్, క్రీడా వస్తువులు అక్బర్ అందించారు. అతనిని ఆదర్శంగా తీసుకొని పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, గ్రామ స్తులు సహకరించాలని కోరారు. ప్రతి విద్యార్థి ఆటల పోటీ ల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ అక్బర్, షేక్ బాలి సైదా, ఎం రమాదేవి, వి శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ సత్యం పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ జెసిలో యోగా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి మనిషి ప్రశాంత జీవితానికి, శారీరక శక్తికి యోగా సాధన ప్రధాన మార్గమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. అన్నారు. శనివారం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో యోగా గురువు జె.శ్రీనివాస్ నేతృత్వంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో సాక్షికి బెదిరింపు

అత్తణ్ణి పట్టుకొని పోలీసులకు అప్పగింత



మాట్లాడుతున్న బాధితురాలు రాధ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ఇటీవల జరిగిన అట్రాసిటీ యాక్ట్ కేసులో ఉన్న సాక్షిని బెదిరించిన ఘటన మంగళగిరిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కేకలు వేయడ తో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు ఫోన్‌చేసి బెదిరించిన వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. మంగళగిరి పట్టణంలోని కుప్పురావుకాలనీ 11వ లైన్‌లో నివాసం ఉంటున్న పి.రాధ అనే మహిళను కులం పేరుతో దూషించిన ఘటన మంగళగిరిలో నెల 24వ తేదీన జరిగింది. పోలీసులు 20 రోజులకు పైగా కేసు నమోదు చేయకపోవడంతో ఈనెల 13వ తేదీన మంగళగిరి డిఎస్పి కార్యాలయంతో దళిత సంఘాలు, బాధిత కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మునగాల ప్రీతిపై నమోదు చేశారు. ఈ కేసులో సాక్షి ఆర్.రమాదేవిని శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు మునగాల సుధాకర్ అనే వ్యక్తి ఇంటిలో వెళ్లి అసభ్య పదజాలంతో మాట్లాడుతూ బెదిరించారని రమాదేవి శనివారం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో మునగాల సుధాకర్‌పై ఫిర్యాదు చేసింది. తాను భయపడి కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు మేల్కొని పోలీసులకు ఫోన్ చేసి పిలిపించడం జరిగింది. బెదిరించిన సుధాకరును పోలీసులు అరెస్టు చేసి పట్టణ పోలీస్ స్టేషనుకు తరలించారు. మునగాల ప్రీతి పి.రాధ అనే దళిత మహిళను అసభ్య పదజాలంతో దూషిస్తూ, కులం పేరుతో దుర్భాషలాడటం జరిగింది. ఈ కేసులో రమాదేవి సాక్షి అవడం వలన బెదిరింపులు చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంఆర్పిఎస్ రాష్ట్ర కన్వీనర్ కె.కుమార్ మాట్లా డుతూ దళితులపైదాడులు, కులం పేరుతో దూషించడం బాధా కరమన్నారు. పోలీసుఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సాక్షి ఆర్.రమాదేవి మాట్లాడు తూ తెల్లవారుజామున ఇంట్లోకి వచ్చి దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త వంట పనికి వెళ్లినట్లుగా తెలిపారు. నేరుగా సుధాకర్ ఇంట్లో కొచ్చి దాడి చేయడానికి ప్రయత్నించినట్లుగా తెలిపారు. అట్రాసిటీ యాక్ట్ కేసులో సాక్షి గా ఉన్నందున ఈ ఈ చర్యలకు పాల్పడినట్లుగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కే.జీవన్ సాగర్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభు త్వ పరిపాలనలో దేశ వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. మంగళగిరి పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు భార్య మునగాల ప్రీతి దళితులను నానా రకాలుగా దళితులను ఇబ్బందులు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి పాలకులు ఇప్పటికైనా కళ్ళు తెరవాలని అన్నారు. స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

యువకునిపై దాడి - పరిస్థితి విషమం

ప్రజాశక్తి - దుగ్గిరాల



మండలంలోని చిలువూరు గ్రామం రైల్వే గేటు సమీపంలో శనివారం రాత్రి జరిగినహత్య ప్రయత్నంలో మంగళగిరి రూరల్ మండల గ్రామం పెద్దవడ్లపూడికి చెందిన పాబోలు ప్రభాస్ అని యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. తలపై కొట్టడమే గాక కత్తితో గొంతులో పొడిచినట్లు తెలిసింది. సమాచారం తెలిసిన వెంటనే దుగ్గిరాల పోలీసులు అతనిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు తెలిసినది. పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం డ్రోన్లతో పొలాలకు పురుగు మందులు కొడుతున్నట్లు తెలిసినది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం దాదాపు నాలుగు సంవత్సరాల కిందట చిలువూరు గ్రామానికి చెందిన ఒక విద్యార్థి మరణంతో ఈ హత్య ప్రయత్నానికి సంబంధం ఉండ వచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది


బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల నూతన తహశీల్దార్‌గా ఎస్. చంద్రశేఖర్ శనివారం పదవీ బాధ్యతలు చేపటారు. ఆయనకు మండలంలోని విఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఇప్పటి వరకు ఇక్కడ వర్కింగ్ ఎరేంజ్‌మెంటు ప్రాతిపదికన పని చేసిన ఆలపాటి వెంకటరమణ పల్నాడు కలెక్టరు కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు.

ఇంటిపై దాడి

ప్రజాశక్తి - తాడేపల్లి



దాడిలో దెబ్బతిన్న ఇల్లు

ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న తాడేపల్లిలో పట్టపగలే ఓ ఇంటిపై దాడి చేసి వ్యక్తిని చితకబాదిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తాడేపల్లి పోలీసులు, బాధితులు కథనం ప్రకారం తాడేపల్లి మెయిన్ రోడ్డు ఆరవ వార్డు లో నివాసం ఉంటున్న వేముల వెంకటేష్ ఇంటిపై అదే ప్రాంతానికి చెందిన వేముల శ్రీనివాసరావు, వేముల వెంక టేశ్వరరావు, వేముల రమణ బాబు, వేముల వెంకటేష్ (బక్కన్న) దాడి చేశారు. ఇంటి పైకప్పు ధ్వంసం చేశారు. అందరూ చూస్తుండగానే వారిపై ఇనుప మలాటాలతో దాడి చేశారు. దాడిని అడ్డుకోవడానికి యత్నించిన వారిపై బెదిరింపులకు దిగారు. బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వేముల శ్రీనివాసరావుని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. బాధితులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులపై ఆసుపత్రిలో మరోసారి దాడికి పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

వాహనం ఢీకొని గేదెలు మృతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



మృతి చెందిన గేదెలు

గుర్తు తెలియని వాహనం తగిలి గేదెలు మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండలంలోని కోయవారి పాలెం పాత మద్రాసు రోడ్డు జరిగింది. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాల ప్రకారం తిక్కిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన సత్యసాయిబాబుకి ఐదు గేదెలు ఉన్నాయి. రోజూ గేదెలను పొలానికి తీసుకెళ్లి మేపుకుని వస్తాడు. వారం ఇంటికి రెండు గేదెలు మాత్రమే వచ్చాయి. మిగతా మూడు గేదెలు రాలేదు అవే వస్తాయనుకున్నాడు. మరుసటి రోజు ఉదయాన్నే ప్రత్తిపాడు వచ్చి టీ తాగుతుండగా అక్కడ కొంత మంది కోయవారి పాలెం వద్ద మూడు గేదెలు రోడ్డుపై చనిపోయాయని చెప్పుకుంటుంటే అనుమానం వచ్చి అక్కడకు వెళ్లి చూశాడు. ఆ మూడు గేదెలు నావే అని గుర్తించి వాటి విలువ ఒక్కొకటి రూ. లక్ష 50వేలు ఉంటుందని తెలిపారు. అవే తన జీవనాధారం కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వమే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పారిశ్రామిక అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

జిల్లాలో అత్యంత వెనకబడిన మాచర్ల నియోజక వర్గంలో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మ నందరెడ్డి చెప్పారు. శనివారం మాచర్ల మండలం రాయవరం గ్రామ సివారులోని ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ పారి శ్రామిక మౌళిక సదుపాయాల కార్పోరేషన్) వారి ఎంఎస్ఎంఈ పార్క్‌లో రూ.4 కోట్ల నిధులతో మౌళిక వసతుల నిర్మాణాలకు ఎమ్మెల్యే జూల కంటి శంకు స్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఐఐసీ పార్క్‌లో అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

విద్యుత్ సబ్‌స్టేషను తనిఖీ చేసిన పిఎస్ఎస్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - దుర్గి

దుర్గి మండల పరిధిలోని అడిగొప్పల, ధర్మవరం, దుర్గి, కోలగుట్ల సబ్ స్టేషన్లను పల్నాడు జిల్లా సర్కిల్ సూపరిం టెండెంట్ ఆఫీసర్ డాక్టర్ పత్తిపాటి విజయ్‌కుమార్ శని వారం తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ సిబ్బందితో సంభాషించారు. పీఎం సూర్యఘర్ డొమెస్టిక్ అప్లికే షన్లను ఎస్సీ ఎస్టీ కులాలు కాకుండా మిగిలిన కులాల వారి దగ్గర నుండి సర్వీసుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. వాలంటరీ అడిషనల్ ఫర్ డొమెస్టిక్ లోడ్ సర్వీసులను 50శాతం రాయితీలతో ఈనెల 30 లోపు అడిషనల్‌గా లోడ్ ఉపయోగి స్తున్న వారి దగ్గర నుండి రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అడిగోప్పలలోని 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర రైతులతో మాట్లాడుతూ వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును నిరంతరం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నామని రైతులతో అన్నారు. అనంతరం సబ్‌స్టేషన్ పరిధిలోని ఖాళీ ప్రదేశంలో మొక్కలను నాటారు. కార్య క్రమంలో మాచర్ల ఈఈ నూతల పాటి సింగయ్య, మాచర్ల డిఈ ఏ రామ య్య దుర్గి మండల విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుపై కౌలు రైతు దిగాలు

- చుట్టుముడుతున్న సమస్యలు
- మూడేళ్లుగా నష్టాలే
- తెగుళ్లతో పెట్టుబడుల పెరుగుదల
- పంటలకు మద్దతు ధరలేక నిరాశ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మిర్చి,ప్రత్తి పంటల దిగుబడులు బాగా తగ్గి పోవడం, పెట్టిన పెట్టుబడులు సరిగా రాక పోవడం పొగాకును కొనేనాధుడే లేకపోవటంతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన కౌలు రైతులు ఈ ఏడాది పంటల సాగుకు ఆసక్తి చూపడం లేదు. పొలాలను కౌలుకు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తు న్నారు. అందునా పొగాకు కొనేనాధుడే లేకపమి చేయాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అందులోను వర్షపాతం సాధారణంగా ఉంటుందన్న ప్రభుత్వ అంచనా లతో మండలంలో భూయజమానులు తమ పొలాలను కౌలుకు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నా, కౌలు రైతులు మాత్రం పంటల సాగు పైమాత్రం నిరాశక్తత చూపు తున్నా రు. గత ఏడాది కౌలు ధరలు ఎకరానికి మిర్చి అయితే రూ. 25 వేల నుంచిరూ.40 వేల వరకు పలికాయి. ఇప్పుడు ఎకరానికి రూ. 15 వేల నుండి రు 25 వేల వరకే పలుకు తున్నాయి. కౌలు ధరలు తగ్గినా కౌలు రైతులు ముందుకు రావడం లేదు. మండలంలో షుమారుగా13వేల ఎకరాలు భూమి ఉండగా అందులో కౌలు రైతులు షుమారుగా 7 నుంచి 8 వేల మందికి పైగా కౌలు రైతులున్నారు. మూడు సంవత్సరాల నుంచి పంటలు సరిగా పడటం లేదు. ఏడాది మిర్చి సాగు చేసిన కౌలు రైతులను నల్లి తెగులు నట్టేట ముంచింది. ఆ తెగులుతో కౌలు రైతులు తీవ్రంగ నష్ట పోయారు. దిగుబడి వచ్చిన కొద్దిపాటి మిర్చి కూడా చేతికి వచ్చే సమయానికి ధరలు తగ్గి పోవడంతో మరి కొందరు



కౌలు రైతులు డీలా పడ్డారు. ఎప్పటికైనా ధర పెరుగు తుం దన్న ఆశతో కోల్డు స్టోరేజీలో నిల్వ ఉంచారు. మూడేళ్ల నుండి కౌలు రైతులు, రైతుల కువ్యవసాయం తీవ్రనష్టాలను మిగు లుస్తోంది. ఈ నేపథ్యంలోనే కౌలు ధరలు తగ్గినా పొలాలను సాగుకు తీసుకోవడంలేదు. సంవత్సరం 10 ఎకరాల్లో వ్యవ సాయం చేసిన కౌలు రైతులు ఈ ఏడాది ఐదెకరాలతోనే (అది కూడా నమ్మకం లేదు) సరిపెట్టుకుంటున్నారు. సంవ త్సరం కౌలు భూములకు ముందుగానే కౌలు చెల్లించే వారు. ఈ సంవత్సరం మాత్రం సగం ముందుగా ఇచ్చి, మిగతా సగం పంటల మీద ఇవ్వండని రైతులే చెబుతున్నారు. కొందరు కౌలు రైతులు ఆ విధంగా ఒప్పందాలు చేసుకుం టున్నారు. అయిన కౌలు రైతుల్లో ఉత్సాహం లేదు. కౌలు ధరల్లో ఎగుడుదిగుడు. మూడేళ్ల క్రితం ఎకరానికి కౌలు ధర రూ.15 వేల నుండి రూ.20 వేల వరకు ఉండేది. రెండేళ్ల కిందట రూ.30 వేల నుండి రూ.40 వేలకు ధర పలికింది. గత ఏడాది కూడా రూ.30 వేలనుండి రూ. 40 వేల వరకు పలికింది. ఈ ఏడాది రూ.10 వేల నుండి రూ. 15 వేల వరకు పడిపోయింది. సంవత్సరం మిర్చి పంట కళ్ళల్లోనే ధర లేక పోవడంతో తేజ మిర్చి 100 కిలోలు రూ. 10 రూ.12 వేల మధ్య ధర పలికింది. లావు మిర్చి క్వింటా రూ.8 నుండి రూ.10 వేలవరకు ధర పలికింది. కానీ ఫిబ్ర వరి, మార్చి, ఏప్రిల్‌లో మిర్చి ధరపడి పోయింది. కొందరు రైతులు కోల్ట్‌స్టోరేజీల్లో మిర్చి పంటను నిల్వ ఉంచుకున్నారు. చిన్న, సన్నకారు రైతులు పంటలను కల్లాల్లోనే అమ్ము కున్నారు. భారీగా పెరిగిన పెట్టుబడులు పంటల సాగుకు పెట్టుబడులు అమాంతం పెరుగుతున్నాయి. కాంప్లెక్స్ ఎరు వులు, పురుగు మందుల ధరలు రైతులను కలవర పెడు తున్నాయి. దానికి తోడు ఎరువులు, పురుగు మందులు 10 నుమచి 15 శాతం అదనంగా వసూలు చేస్తు న్నారు. ప్రతి సంవత్సరం పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతుం డడంతో ట్రాక్టర్ కిరాయిలు కూడా పెంచుతున్నారు. ఎకరా నికి దుక్కిదున్నటానికి రూ.5వేలు, గొర్రు గుంటకకు రూ.3 వేలు, దమ్ముకు రూ.2,500, 3000 తీసుకుంటున్నారు. రోజు వారి కూలి కూడా 300 నుంచి 400 వందల వరకు సందర్భంగా బట్టి తీసుకుంటున్నారంటున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఎస్టీ మహిళకు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో ఈనెల 15వ తారీఖున గిరిజన మహిళ శిరీషభాయ్ పట్ల పట్టణ సీఐ ప్రవర్తించిన తీరుపై మన స్థాపం చెంది, ఆత్మ హత్యయత్నానికి పాల్పడిన విషయమై శనివారం శిరీష బాయ్ కుటుంబాన్ని గిరిజన ప్రజా సమాఖ్య (జిపిఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ పరామర్శిం చారు. జరిగిన ఘటనపై ఆమెను వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా శిరీషభాయి వారితో మాట్లా డుతూ 15వ తారీఖు సుగాలి కాలనీకి చెందిన గిరిజన బాలిక పట్టణంలోని విశాల్ మార్టులో పని చేస్తోందనీ, బాలికకు అక్కడ షాపింగ్ చేయడానికి వచ్చిన వ్యక్తులకు మధ్య జరిగిన ఘర్షణ పోలీస్ స్టేషన్ వరకు దారి తీసిందని తెలిపారు. ఈ విషయంపై శిరీష బాయికి, పోలీసులకు మధ్య జరిగిన సంభాషణలో టౌన్ సిఐ కలగ జేసుకొని తన పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వ్యక్తిగతంగా దూషిస్తూ అవ మానం చేశారని చెప్పారు. వడిత్యా శంకర్ నాయక్ మాట్లా డుతూ ఇది శిరీష



బాయ్‌కి జరిగిన అవమానం కాదని, యావత్ గిరిజన సమాజంపై జరిగిన అవమానంగా భావి స్తున్నామని అన్నారు. ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి న్యాయ విచారణ జరిపించి దురుసుగా ప్రవర్తించిన పోలీసు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితురాలికి తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు చేసే పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చ రించారు. కార్యక్రమంలో జిపిఎస్ రాష్ట్రనాయకులు నూన్ సావత్ విష్ణునాయక్, రావ వత్ అంజి నాయక్, పాతలావత్ దుర్గా నాయక్, ఇస్లావత్ హనుమంతు నాయక్ , నూన్ సావత్ వజ్రాబాయి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

46 శాతం పనులు చేసి 90 శాతమంటూ ప్రచారం : యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వైసీపీ ప్రభుత్వం 151 సీట్ల నుండి 11 సీట్లకు పడిపోవటంతో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆయనతో పని చేసిన ఎమ్మెల్యేలకు కూడా మతిభ్రమించి తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలను కోవడం సిగ్గుచేటు అని గురజాల శాసనసభ్యులు శాసన సభ్యులు ఎరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం బ్రాహ్మణపల్లి వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని అధికారులతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీ ఎంఎస్ఐడిసి ఈఈ సివి రమణను మెడికల్ కాలేజీ పనులు ఎంతవరకు పూర్త య్యాయని అడిగి తెలుసుకున్నారు.అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి కొరకు ఇచ్చిన ప్రాజెక్టు ప్రభుత్వ వైద్యశాల కాలేజీ అని తెలిపారు. ఈ ప్రాజెక్టు 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రాజెక్టు అని తెలిపారు.ఈ ప్రాజెక్టును కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40%తో ఈ ప్రాజెక్టుని పూర్తి చేయాల్సి ఉందన్నారు. 25వ తేదీ మే నెల 2021



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ప్రాజెక్ట్ అగ్రిమెంట్ చేసుకున్నారని, ఈ ప్రాజెక్టు మొత్తం మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సిన అగ్రిమెంట్ అన్నారు.ఈరోజుకు 46శాతం పనులు పూర్తి చేస్తే,మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాత్రం 90 శాతం పూర్తి చేశామంటూ అబద్ధపు ప్రచారాలతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయటం ఆయనకే చెల్లుబాటు అన్నారు. మేము అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలో ఎన్నో పనులు పూర్తి చేశామన్నారు. 70 సంవత్సరాలు పలనాడు ప్రజలు మంచినీళ్లు లేవు అంటూ మంచినీళ్లు తాకుండానే బతికారా అంటూ ఆయన ప్రశ్నిం చారు. జగన్ మాటలు నమ్మిన వ్యక్తి బెట్టింగ్లకు పాల్పడి కోట్లు రూపాయలు పోవటంతో చనిపోవడం జరిగిం దన్నారు. చనిపోయి సంవత్సరం అయితే ఇప్పుడు ఓదార్పు యాత్ర అంటూ రావటం సిగ్గుచేటు అన్నారు. ఆ యాత్రలో నరకండి,చంపండి అంటూ ప్లే కార్డులు ప్రదర్శిస్తుంటే అలాంటి రౌడీలను సపోర్ట్ చేయటం ఇలాంటి నాయకులు దేశానికి ఎలాంటి సందేశాలు ఇస్తున్నారు అర్థం కావటం లేదన్నారు. తెలుగు దేశం ప్రభుత్వం ప్రోటోకాల్ పాటిం చడం లేదంటూ కాసు మహేష్ రెడ్డి అనటం హాస్యాస్ప దంగా ఉందన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, సాగర్ రైట్ కెనాల్ చైర్మన్ పులుకూరి కాంతారావు,ప్రముఖ వైద్యులు సీనియర్ నాయకులు ఉన్నం నాగ మల్లికార్జునరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ తురక వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరావు,వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు,టిడిపి రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు దియా రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ
- 200 రోజులకు ఎసిసి కార్మికుల దీక్షలు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ

ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తాడేపల్లి ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వై నేతాజీ డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 200 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్మిక కుటుంబాలను ఉద్దేసించి నేతాజీ మాట్లాడారు. ముందుగా కూరపాటి శ్రీను అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి ఇచ్చిన అనేక హామీలు నేటికీ అమలు చేయకుండా తాత్సర్యం చేస్తుందని ఆయన విమర్శిం చారు. అధికార పార్టీ తలుచుకుంటే ఎసిసి కార్మికుల సమస్య పరిష్కరించటం పెద్ద సమస్య కాదని తేల్చి చెప్పారు. నియోజక వర్గంలో అనేకమందికి ఇళ్ల స్థలాల సమస్య పట్టాల సమస్యలు ఇంకా అనేకం పెండింగ్ ఉన్నాయని పేర్కొన్నారు.వాటన్నిటిని కూడా పరిష్కరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలకు పూనుకోవాలని కోరారు. న్యాయస్థానాలు కార్మికులకు అనుకూలంగా తీర్పులు వెలువరించిన అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని నేతాజీ మండిపడ్డారు. 33 సంవత్సరాలు కావస్తున్న ఎసిసి సమస్య పరిష్కారం కాకపోవటం చాలా దురదఅష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 170 మంది కార్మికులు చనిపోయి అనేకమంది కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నార నీ వివరించారు. ముఖ్యమంత్రి నివాసానికి కూత వేడు దూరంలో ఉన్న ఎసిసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని నేతాజీ డిమాండ్ చేశారు. దీక్షలను సిఐటియు, ఏఐటీయూసీ, వైయస్సార్ టి యు, ఐ ఎన్ టి యు సి, ఏఐఎఫ్టియు (న్యూ) కార్మిక సంఘాలు నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టియు నాయకులు శ్రీనివాసరాజు, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతి రెడ్డివెంకట రెడ్డి, కె.కోటయ్య, ఏఐటీయూసీ నాయకులు కె.వెంకటయ్య, మాట్లాడారు. సభకు యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కరించ కుంటే కార్మికుల ఐక్యంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.గురవయ్య, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, అంకయ్య, వెంకటేశ్వర్లు,జానీ భాష,హిమాంబి,దుర్గ భవాని, పాల్గొన్నారు. దీక్షలో నవనీతమ్మ, రవణమ్మ, సారమ్మ, శారద, మాణిక్యం తదితరులు కూర్చున్నారు.



కాజాలో గ్రామీణ శ్రామికుల సర్వే

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రజాసంఘాల కమిటీల ఆధ్వర్యంలో కాజా గ్రామంలో గ్రామీణ శ్రామికుల సర్వేను శనివారం నిర్వహించారు. గ్రామాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర పనులు చేసేవారి వివరాలు తెలుసుకున్నారు. కౌలు రైతులు పడుతున్న అనేక సమస్యలను సర్వే దృష్టికి తీసుకువచ్చారు. మంగళగిరి కార్పొరేషన్ అయిన తర్వాత గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పనులు తొలగించారని దీని కారణంగా వ్యవసాయ పనులు లేని రోజుల్లో వేరే ప్రాంతాలకు వలస వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. సర్వేలో చేతి వృత్తిదారుల నాయకులు భాస్కరయ్య బాలకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, కోటేశ్వరి, అజయ్ శివయ్య సిఐటియు నాయకులు ఎస్.ఎస్.చంగయ్య , దుర్గారావు బాలాజీ గోపాలరావు, అప్పారావు, సత్యమారెడ్డి, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలి : సిపిఎం



మాట్లాడుతున్న కొల్లిపర బాబుప్రసాద్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం తెనాలి కమిటి కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ అన్నారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదవడ్లపూడి హై లెవల్ చానెల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి రైతులకు సకాలంలో సాగు నీరు విడుదల చేయాలని కోరారు. శుభం కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం, భీమా సంస్థలు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. పసుపు తగలబడి రెండు యేళ్ళు గడుస్తున్నా వారికి నష్టపరిహారం అందకపోవడం శోచనీయమన్నారు. వాలంటీర్ల వ్యవస్థ రద్దుపై ప్రభుత్వం స్పష్టతలేదన్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణి వ్యవస్థ నిలిచిపోవడంతో డ్రైవర్లు ఉపాది కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఎం తెనాలి రూరల్ మండలం కార్యదర్శి ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వమేర్పడి ఏడాది గడుస్తున్నా రైతులకు పెట్టుబడి సహాయం అందకపోవడం అన్యాయమన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారికి పెట్టుబడి సహాయం అందించాలని కోరారు. దీపం పథకం ద్వారా జమ అవుతాయనుకున్న నిధులు బ్యాంక్‌లో జమ కాకపోవడటంపట్ల అసంతఅప్తి వ్యక్తమౌతుందన్నారు. తల్లికి వందనం కూడా అందరికీ బ్యాంక్‌లో జమ కాలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ హుస్సేన్ వలి, కె.రవికుమార్, ఎన్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్, నల్లమడ వాగు పనులను ప్రారంభించాలి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు, నల్లమడ వాగు ఆధునీకరణకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, లేనిచో దశల వారీగా ఆందోళనకు పూనుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. నేడు పెదనందిపాడులో జరిగిన సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతిపాడు నియోజక వర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి అనేక హామీలు ఇచ్చారని, ఆచరణలో హామీలు అమలు జరపలేదని అన్నారు. నియోజక వర్గంలో దాదాపు నాలుగు మండలాల రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు ఉపయోగపడే గుంటూరు ఛానల్ పొడిగింపుకు ఇంతవరకు నిధులు కేటాయించలేదని, నల్లమడ ఆధునీకరణ వల్ల గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలో దాదాపు పది మండలాల రైతులకు ఉపయోగపడే నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర్చలేదని, గతంలో వైసీపీ ప్రభుత్వం,ప్రస్తుత తెలుగుదేశం మంత్రులు శాసనసభ్యులు ఈ నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ప్రతిసారి మేము అధికారంలోకి వస్తే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, ఎవ్వరూ హామీలు అమలు జరపలేదన్నారు. 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు అందించే గుంటూరు ఛానల్ పొడిగింపుకు వెంటనే నిధులు కేటాయించకపోతే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకుని ఐక్యంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు అసంపూర్ణంగా జరిగాయని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కవులు రైతులకు కూడా వర్తింపజేసి, పెట్టుబడి సాయం 20 వేలు ఇవ్వాలని, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం వాగ్దానానికే పరిమితం అయిందని, ప్రతి మహిళా ఖాతాలో 15 వేల రూపాయలు జమ చేస్తామని వాగ్దానం నెరవేరలేదని, నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భఅతి ఇంతవరకు ఇవ్వలేదని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, గ్రామాలలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, ఫిల్టర్ బెడ్లు పనిచేయడం లేదని, నీరు దుర్వాసన వస్తుందని ,మంచినీరు మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందన్నారు. నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని, పెదనందిపాడు, కాకుమాను మండల కేంద్రంలో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వెంటనే పొగాకు కొనుగోలు ప్రారంభించాలని కోరారు. కాకుమాను మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న గిరిజనులకు కనీసం ఆధార్ కార్డులు గానీ, రేషన్ కార్డులు గాని లేవని వెంటనే వారికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని, ప్రభుత్వ భూములలో ఇల్లు వేసుకొని నివాసముంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామాలలో డ్రైనేజి వ్యవస్తను మెరుగుపంచాలని, నిరంతరం కాల్వలలో పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు. మంచినీటి చెరువులు తక్షణమే నింపేలా చర్యలు చేపట్టాలని కోరారు.రోడ్ల గుంటలు పూడ్చి రోడ్డు ప్రమాదాలు నివారించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ విరమించుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కుటుంబానికి 200 రోజుల పని దినాలు, రోజుకు 600 రూ.లు వేతనం ఇవ్వాలని, పని ప్రదేశం లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. భాస్కరయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం మంగళగిరి రూరల్ మండలంలోని కాజ గ్రామంలో సిపిఎం పార్టీ మంగళగిరి రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అడ్డుకోవాలని వేసిన కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటిలో బాగున్న కరెంటు మీటర్లను తొలగించి ఆదాని కంపెనీ స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తున్నారని ప్రజల యొక్క ముందస్తు అనుమతి లేకుండా మోసపు మాటలు చెప్పి బెదిరించి మీటర్లను మార్చుతున్నారని ఈ మీటర్ల వలన శాశ్వతంగా మనపై విపరీతమైన భారాలు పడతాయని క్రమంగా విద్యుత్ పంపిణీ కూడా ఆదానేలాంటి బడా కంపెనీల చేతికి వెళ్లబోతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలు, ప్రమాదాలను గుర్తించి ఆదిలోనే అడ్డుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ మీటర్ల సెల్ ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాలని ఇంటికి వచ్చి రీడింగ్ తీయరని, బిల్లు ఆన్‌లైన్‌లోనే ప్రైవేట్ కంపెనీ రీడింగ్ చూస్తుందని, ఆన్లైన్ లోనే బిల్లులు పంపుతుందని, సమాధానం చెప్పే నాధుడు కూడా ఉండదని మన డబ్బే రోజు కట్ చేసుకుంటారని డబ్బులు అయిపోతుండగా మూడు రోజులకు ముందు మెసేజ్ పెడతారని రీచార్జ్ చేయించుకోవాలని లేకపోతే కరెంటు పోతుందని తెలుపుతారని తెలిపారు. స్మార్ట్ మీటర్ అయ్యే ఖర్చు రూ.10,000 నుండి 17వేల వరకు ఉంటుందని 93 నెలల్లో మీటర్ అద్దె పేరుతో మన వద్ద ఈ డబ్బు మొత్తం నెలవారీ వాయిదాలలో వసూలు చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు ఆదాని కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారని సుమారు 25 వేల కోట్ల రూపాయల భారం జనంపై పడుతుందని తెలిపారు. ఆదానిని బాగు చేయడానికి మన ఇంట్లో మీటర్లు బిగించుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చి సంవత్సర కాలంలో 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారం వేసిందని తెలిపారు. బడా కంపెనీల లాభాలు, అధినేతల జేబులు నింపుకోవడం కోసం మనపై విద్యుత్ బిల్లులు ఎక్కువ వేస్తున్నారని షాపులు పరిశ్రమలకు యూనిటీ ఆరు పైసలుగా ఉన్న విద్యుత్తు సుంకాన్ని 100 పైసలు పెంచారని కూటమి ప్రభుత్వం దానికి చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. ఆనాడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని చెప్పిన తెలుగుదేశం నేతలే నేడు మీటర్ల బిగించాలని ఆదేశాలు ఇవ్వటం మోసపూరితమని విమర్శించారు. విద్యుత్ దోపిడీలో బిజెపి టిడిపి జనసేన వైసిపి అందరిదీ ఒకే దారి అని బడా కంపెనీలకు దోసి పెట్టడం పాలకుల జేబులు నింపుకోవడం వినియోగదారులను దండుకోటంలో వీరందరూ దోషులేని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి యు.దుర్గారావు, నాయకులు బి.కోటేశ్వరి, జి.అజయ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం కాజా గ్రామ నాయకులు బి. సత్యమారెడ్డి, మేడ శివయ్య తదితరులు పాల్గన్నారు.

నేడు కొల్లూరులో దివి హాస్పిటల్స్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన దివి మల్టీ స్పెషాలిటీ వైద్యశాల బఅందం ఆదివారం కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ హాలులో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ చందు ఉదయ్ భాస్కర్ తెలిపారు. సాయిపథం సత్సంగ కేంద్రం ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న శిబిరంలో జనరల్ మెడిసిన్, యూరాలజీ, గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఇవన్ని విభాగాలకు సంబంధించిన రుగ్మతలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇతరులు

యువత పోరును విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన ప్పటికీ నిరుద్యోగ యువతకు ఇస్తామన్న 20 లక్షల ఉద్యోగాలు కల్పించలేకపోయారన్నారని యువతను కూటమి అన్ని విధాలా మోసం చేయడాన్ని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు సోమవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమంలో నిరుద్యోగులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో పల్నాడు జిల్లా యూత్-విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యువత పోరు పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం నిరుద్యోగికి ప్రతి నెల రూ.3వేలు నిరుద్యోగ భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం లింగంగుంట్ల గ్రామ పరిధిలోని వైసిపి జిల్లా కార్యాలయం వద్ద నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తామన్నారు. వైసిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులిస్తే సరిపోదు అధికారాలను ఇవ్వండి : లోక్‌సత్తా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించే గొప్ప రాజ్యాంగం భారతదేశినిదని, ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశంలో అమలవుతున్నా, ఈ దేశంలో కుల వివక్షత నాయకుల మనసుల్లో నుండి తొలగించుకో లేకపోవడం అత్యంత విచారకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఆదర్శంగా ఉండాల్సిన ప్రజా ప్రతినిధులే ఇలా ప్రవర్తిస్తే ఎలా అని ప్రశ్నించారు? పొలిటికల్ రిజర్వేషన్ ద్వారా ఎన్నిక కాబడిన సర్పంచ్ స్థానాలలో ఉప సర్పంచ్ పెత్తనం చేస్తున్న సంగతి కొన్ని చోట్ల జరుగుతుందని అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు చట్టసభలలో పొలిటికల్ రిజర్వేషన్లు కల్పించింది కేవలం సంఖ్యా బలం కోసం కాదని నిర్ణయాధికారం కలిగిన రాజ్యాధికారంలో దళితులకు వాటా ఉండాలని వారు కోరుకున్నారని అన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రఫాని

పారిశుధ్యంపై మున్సిపల్ ఛైర్మన్ సమీక్ష

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో పారిశుధ్య మేస్త్రీలు సెక్రటరీలతో శనివారం ఛైర్మన్ రఫాని సమావేశం నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని ఆదేశాలు ఇచ్చారు. సీజనల్ వ్యాధులుతో ప్రజలు ఇబ్బందులు పడకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలంలో రోడ్లపై వర్షపు నీరు నిలబడకుండా పారిశుధ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపునీరు ఎప్పటికప్పుడు డ్రైన్లలో పారే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే భారీ డ్రైన్లలో పూడికతీత పనులు ప్రారంభించామనీ, సిబ్బంది సరిగా పని చేయకపోతే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. సమావేశంలో శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్, ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి గాయత్రీదేవి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం శనివారం జరిగింది. 101- మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఏఈఆర్‌వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, మాస్టర్ ట్రైనర్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పోలింగ్ బూత్ లకు సంబదించిన సదుపాయాలు, 1200 ఓట్లు మించిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. వేరే ప్రదేశంలో ఉంటూ పోలింగ్ బూత్ నకు దూరముగా ఓటర్స్ ఎవరైనా ఉన్నారా అనే విషయములపైన, రానున్న రోజులలో మాస్టారు ట్రైనర్స్ చేత, బిఎల్‌ఓలకు ట్రైనింగ్ ఇవ్వడం గురించి చర్చించారు. సమావేశం అనంతరం మాచర్ల అర్బన్‌కు సంబంధించిన పలు పోలింగ్ బూత్ లను ఎలక్ట్రోల్ అధికారి గాయత్రి దేవి, మాచర్ల తహశాల్దార్ కిరణ్ కుమార్, కమిషనర్ వేణుబాబు పరిశీలించారు.



సమీక్షలో పాల్గొన్న అధికారులు

స్టేషన్లను శుభ్రం చేసుకున్న పోలీసులు



పోలీస్ స్టేషన్‌లను శుభ్రం చేస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్లు, స్టేషన్ ఆవరణలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా పోలీస్ అధికారులు చేపట్టారు. శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాలతో పోలీస్ సిబ్బంది పోలీస్ స్టేషన్ లను శుభ్రం చేయడంతో పాటు ఆవరణ చుట్టూ ఉన్న చెత్త చెదారం పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. నెలలో మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఎస్డిపిఓ, సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచారు.

నియోజకవర్గానికి రూ.3.50 కోట్లు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం 3.50 కోట్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 16 పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ.3.50 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులను తెచ్చేలా రానున్న రోజుల్లో పని చేస్తామన్నారు.

వైసిపి సమాధికి వారే ఇటుకలు పేర్చుకుంటున్నారు

డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

2029లో మీపార్టీ అధికారంలోకి వస్తే ఎదుటి వాళ్ళని రప్పా రప్పా నరుకుతాం అనడం, ఆభాషను జగన్ సమర్థించటం చూస్తూంటే వైసిపి సమాధికి వారే ఇటుకలు పేర్చుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి భాషను గత ఎన్నికల ముందు మాట్లాడబట్టే ప్రజలు ఆ పార్టీని 11 సీట్లుకు పరిమితం చేశారన్నారు. నెల రోజులుగా రాప్తాడు, పొదిలి, రెంటపాళ్లలో మీ కార్యకర్తలు వాడిన భాష జుగుప్సాకరంగా ఉందన్నారు. భవిష్యత్తులో కేంద్రంలో, రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. సమావేశంలో మాచర్ల, రెంటచింతల పార్టీ అధ్యక్షులు కొమ్ము కోటేశ్వరరావు, దొడ్డ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు షేక్ బాబు, నాసర్ వలి పాల్గొన్నారు.



అమరావతిలో యోగా వేదికపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర అధికారులు

మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా

అమరావతి - ప్రజాశక్తి

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా అమరావతిలో యోగ సాధన

ఆరోగ్య వికాసాన్ని పెంచి, మానసిక ఆందోళన తగ్గించే అద్భుతమైన ఔషధం గా భావించి యోగ సాధనకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అమరావతి బుద్ధ స్తూపం ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో నర్సరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీకష్ణదేవరాయలు పాల్గొన్నారు. ప్రజలతో పాటు వివిధ శాఖల అధికారులు ,సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు.

ప్రజాశక్తి - మాచర్ల

మానసిక ఒత్తిడిని జయించే ఆయుధం యోగా అని ఎంఎల్‌ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని పట్టణంలోని ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం ఉదయం యోగా సమ్మేళనం వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సనాతన హైందవ సాంప్రదాయంలో యోగా ఒక భాగమన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి యోగా గురు వుల సూచనలు అనుసరిస్తూ యోగా చేశారు. కార్య క్రమం లో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, కమి షనర్ వేణుబాబు, తహశీల్దార్ కిరణ్‌కుమార్, నాయకులు వై. కేశవ రెడ్డి, కొమెర దుర్గారావు, జూలకంటి అక్కిరెడ్డి, కంభంపాటి అనిల్‌కుమార్, సిద్దయ్య, పట్టణ ప్రజలు, వివిధ పాఠశాల విద్యార్థులు, పురప్రముఖులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే డ్రైవర్లకు యోగ తప్పనిసరి అని జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం సమీ పంలో రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్ఛ్ సెంటర్‌లో డ్రైవర్లకు యోగ కార్యక్రమాన్ని నిర్వ హించారు. జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, రోడ్ సేఫ్టీ ఎడ్యు కేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్ఛ్‌సెంటర్ ఇన్స్‌పెక్టర్ డి.నాగేశ్వరరావు రోడ్‌సేఫ్టీ ఎన్జీవో సభ్యులు ఆర్.బంగారయ్య, డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం విజయ వంతమైంది. స్థానిక లాంచీ స్టేషన్, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లాంచీ స్టేషన్‌లో విద్యార్థులతో కలిసి పర్యాటక శాఖ ఉద్యోగులు యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఉద్యోగులు వినయతుల్లా, రామారావు, రాజేష్, శ్రీను, రమణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దుర్గి మండలంలోని ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో యోగాలో పాల్గొన్నారు. యోగ కార్యక్రమంలో వివిధ రకాల భంగిమల తో ఆసనాలు వేశారని ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తెలిపారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కోమటినేని శోభారాణి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యార్డు ఆవరణలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. యార్డు డైరెక్టర్లు, యార్డుసిబ్బంది, వాకర్స్ అసోషియేషన్ సభ్యులు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ కూటమి నాయకులు మేడం రమేష్, నాగశ్రీను రాయల్, షమీంఖాన్, నిస్సంకర శ్రీనివాసరావు, కౌన్సిలర్ షకీలా, ఆర్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవంఎంపిడిఓ జి.రవి కుమార్, తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, డాక్టర్ సిరిచంద్రిక, విద్యుత్ ఏఈ బసవరాజు, ఎంపిపి కోటయ్య, ఎం. శ్రీనివాసరావు, కాశయ్య, ఏ. వెంకట్రామిరెడ్డి, టి. వెంకట్రావు, విఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండలం జిల్లా జడ్పీ హెచ్ హైస్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెల్లంకొండ మండలం ఎంపీడీవో సునీత బిజెపి పల్నాడు జిల్లా కిసాన్ మోర్చా సెక్రెటరీ గోగినేని వెంకటరమణ, మండలాధ్యక్షులు ఓర్చురాజు విచ్చేశారు. రెవెన్యూ, సచివాలయ, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు యోగకోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో యోగాంధ్రలో భాగంగా సిబ్బందితో కలిసి యోగ చేశారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

యోగాంధ్రలో భాగంగా మండలంలోని 14 గ్రామ సచి వాలయాల వద్ద యోగాసనాలు సాధన చేశారు. ఇన్చార్జి ఎండిఓ శరత్ బాబు ఆధ్వర్యంలో యోగ వేడుకలు జరిపారు. గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు సచివాలయ సిబ్బంది యోగాసానాలు చేశారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వ్యాయమం వల్ల శరీరానికే మంచిదైతే యోగా వల్ల మనసుకు ఉత్తేజాన్నిస్తుందని, తనువుకు, మనసుకు, ఆత్మను ఏకం చేసే సాధనమే యోగాని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా యోగా గురువులు అందరితో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మధుబాబు, మున్సిపల్ కమిషనర్ ఇరువురి శ్రీనివాసరావు,పట్టణ సిఐవెంకట్రావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి కూడా అవస్థలేనా..?

మంత్రి లోకేష్ అయినా స్పందిస్తారా..?

ప్రజాశక్తి- తాడేపల్లి

జీవితంలో అనేక ఒడిదుడుకులు... బాధ లు... కష్టాలు ఎదుర్కొని... తనువు సాలించిన మనిషికి తాడేపల్లిలో ఆఖరి మజిలీ (మరణం)లో కూడా తిప్పలు తప్పడం లేదు. మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్‌లో భాగమైన తాడేపల్లి కనివిని ఎరుగని రీతిలో దినదినాభివృద్ధి చెందుతోంది. 20 సంవత్సరాల క్రితం ఉన్న తాడేపల్లి, ఇప్పుడున్న తాడేపల్లి ని చూస్తే ఔరా అనిపించక మానదు. తాడేపల్లి పట్టణ జనాభా కూడా లక్ష మార్క్ దాటింది. ఇంత అభివఅద్ధి చెందిన తాడేపల్లిలో మనిషి చనిపోతే తీసుకెళ్లే "ఆఖరి మజిలీ " (స్మశానం) సరైనది లేకపోవటం ఒకింత ఆశ్చర్యం కలిగించక మానదు. తాడేపల్లి కంటే వెనుకబడిన కొన్ని గ్రామాల్లో" ఆఖరి మజిలీ"లు అద్భుతంగా నిర్మాణం గావించారు. తాడేపల్లి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు సరైన స్మశాన వాటిక లేక వెక్కిరిస్తుంది. ఇటీవల మంగళగిరి ఎమ్మెల్యే, మరియు మంత్రి నారా లోకేష్ కఅష్ణా నది ఒడ్డున, సీతానగరంలో కర్మకాండలు నిర్వహించుకునేందుకు వీలుగా షెడ్ ఒకటి నిర్మాణం గావించారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ డే సందర్భంగా తాడేపల్లి తాసిల్దార్ డి.సీతారామయ్య తాడేపల్లి సరైన స్మశాన వాటికలు లేకపోవటం సమావేశంలో లేవనెత్తారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడైనా ఉంటే వాటిని గుర్తించి స్మశాన వాటికలగా అభివఅద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ రెండు సంఘటనలను ప్రజలు స్వాగతించారు. అటు సీతానగరం నుండి ఇటు శర్మ డాబా వరకు మూడు కిలోమీటర్ల మేర తాడేపల్లి పట్టణం విస్తరించి ఉంది. సదరపు కిలోమీటర్లుగా చూస్తే 27 చదరపుకిలోమీటర్లు గా విస్తరించి ఉంది. ముఖ్యంగా బైపాస్ ప్రాంతం పూర్తి పట్టణ వాతావరణం సంతరించుకుంది. పెద్ద ఎత్తున ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్లతో పాటు ప్రత్యేక అపార్ట్మెంట్లు, విల్లాలు నిర్మాణాలు జరిగా యి. ఇంకా జరుగుతున్నా యి. ప్రస్తుతం బైపాస్ రోడ్డు ప్రాంతం లో నివాసం ఉంటున్న వారందరూ కృష్ణానదిని" ఆఖరి మజిలీ"గా వినియోగించు కుంటున్నారు. వర్షాకాలం వస్తే దీని బాధలు వర్ణనతీతంగా ఉంటున్నాయి. పోల్కంపాడు, సంజీవ్ నగర్, ఉండవల్లి సెంటర్ ప్రజలు అయితే కొండవీటి వాగు సమీపంలో





కనీస సౌకర్యాలు లేని శ్మశాన వాటిక, పనిచేయని బోరింగ్ పంపు

దశదిన కర్మలు చేస్తున్నారు. తాడేపల్లి పట్టణం నడి బడ్డు, కొత్తూరు, ముగ్గు రోడ్డు ప్రాంతాల ప్రజలు అయితే అమర రెడ్డి నగర్‌లో రోడ్డు పక్కన గల సుమారు 40 గజాల స్థలంలోనే కార్యక్రమం ముగించేస్తున్నారు. నులకపేట, ప్రకాష్ నగర్, డోలాస్ నగర్ ప్రాంతాల ప్రజలు కృష్ణ నగర్ పాత పంచాయతీ కార్యాలయం పక్కన క్వారీ గుంటల్లో అంతిమ సమస్కారం కానీ చేస్తున్నారు. ఎండాకాలం, వానాకాలం అయితే అంతిమ సంస్కారంలో పాల్గొనే వాళ్ల బాధలు వర్ణన తీతంగా ఉంటాయి. రోడ్డు పక్కన జరుగుతున్న" ఆఖరి మజిలీ " దగ్గర కనీసం నిలబడటానికి నీడను ఇచ్చే చెట్టు కూడా లేదు. కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడానికి అమరా రెడ్డి నగర్ రోడ్డు పక్కన ఉన్న స్మశాన వాటిక దగ్గర ఉన్న బోరింగ్ పంపు కూడా పనిచేయడం లేదు. అక్కడి నుంచి అర కిలోమీటర్ దూరం నడిచి వచ్చి బకింగ్ హెూమ్ కెనా ల్ శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. పైన పేర్కొన్న మిగతా శ్మశాన వాటికల దగ్గరైతే ఈ మాత్రం సదుపాయాలు కూడా కరువయ్యాయి. ఇటీవల మంత్రి లోకేష్ సీతానగరం సమీపంలోని మహానాడులో కర్మ కండల కోసం షెడ్డు ఏర్పాటు చేశారు. కొత్తూరు లో కాలువ పక్కన కళ్ళం కళ్ళం వెంకటరెడ్డి పేరుతో మరో కర్మకాండల్ షెడ్ నిర్మాణమైంది. షెడ్డులు ఏర్పాటు చేసిన మంత్రి నారా లోకేష్, మరియు దాతలకు పట్టణ ప్రజలు అభినందనలు చెప్తున్నారు. అయితే" చివరి మజిలీ " అంతిమ సంస్కారం నిర్వహించే స్మశాన వాటికలు అభివఅద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మంత్రి లోకేష్ చొరవ, మరియు తహశీల్దార్ సీతారామయ్య ప్రకటన ఘటన ప్రజలకు కొంత ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఆ దిశగా వారిద్దరూ చొరవ తీసుకొని తాడేపల్లి పట్టణానికి తగిన విధంగా సుందరీకరణతో కూడిన "ఆఖరి మజిలీ"లు నిర్మాణంగా వించాలన పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.







తెనాలిలో జరిగిన యోగ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్, సిబార్ కళాశాలలో యోగ డేలో పాల్గొన్న విద్యార్థులు, గుంటూరు భాష్యం కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

యోగతో మానసిన ప్రశాంతత

ప్రజాశక్తి - తెనాలి

మానసిక ప్రశాంతతకు యోగా సాధన ముఖ్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర 2025 నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ, మున్సిపల్ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, అసిస్టెంట్ కమిషనర్ వి.లక్ష్మీపతి, తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపం మైదానంలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ యోగి గురూజీ యోగా సాధకుల చే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ అలీం భాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల లతో పాటు పలువురు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వాడవాడలా యోగ మంగళగిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం విద్యార్థిని విద్యార్థులుచే యోగా చేయించారు. అన్ని వార్డుల సచివాలయాల్లో సచివాలయ అధికారులు, కూటమి నాయకులు యోగా కార్యక్రమం నిర్వహించి పాల్గొన్నారు. ఏపీఎస్పీ క్యాంపులో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్పీ కమాండెంట్ కె.నగేష్‌బాబు, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. యోగ అధ్యాపకురాలు డాక్టర్ రుక్మిణి జ్యోతిర్మయి, కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, జాతీయ దంత వైద్యం మండలి సభ్యురాలు డాక్టర్ రేవతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

స్థానిక అవుతురామిరెడ్డి జూనియర్ కళాశాల మైదానంలో యోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాల గురించి పలువురు వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖలఅధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, కళాశాల కరస్పాండెంట్ బొమ్మ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు

యోగా ద్వారా భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయని, తద్వారా నిర్ణయాత్మక శక్తి వృద్ధి చెందుతుందని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాష్యం విద్యా సంస్థల ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించిన యోగోత్సవ్ ముగిసింది. యోగా అధ్యాపకురాలు సుధారాణి యోగాసనాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో యోగ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కెఎల్ యు, స్వామి వివేకానంద యోగా కేంద్రం విజయవాడ సంయుక్త అద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు , ఆచార్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక బాలుర హైస్కూల్లో శనివారం అంతర్జాతీయ యోగా డేను ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షురాలు కేసంనేనటి శ్రీ అనిత, తాసిల్దార్ సునీత ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈఓపీఆర్డి జవహర్లాల్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

సీతానగరంలోని విజయ కిలాద్రి దివ్య క్షేత్రంలో యోగ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగ చేయడం వలన శారీరక రుగ్మతలే కాకుండా మానసిక రుగ్మతలు తొలగుతాయని శ్రీమాన్ శ్రీనివాసాచార్య గురువు తెలిపారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల గ్రామస్థాయి అధికారులు సిబ్బంది బిజీబిజీగా 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం, నీరు - మీరు కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో అన్ని గ్రామాలలో ఈ రెండు కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఊహారాణి, టిడిపి మండల అధ్యక్షులు మైలా వెంకటరామరాజు, పార్టీ నాయకులు శివలింగ ప్రసాద్, అందరు సర్పంచులు పాల్గొన్నారు. అలాగే నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



కృష్ణను అభినందిస్తున్న టిడిపి నాయకులు

దాసరి కృష్ణకు అభినందనలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ రూరల్ అధ్యక్షునిగా ఇటీవల నూతనంగా నియమితులైన దాసరి కఅష్ణను ఉండవల్లి టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, పలువురు టీడీపీ నాయకులు కలసి అభినందించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు దాసరి కృష్ణని దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్,గాదె బసివి రెడ్డి, వంగా నరేంద్ర, భార్గవ్, రంగా బాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ మహిళా పోలీస్ మౌనిక మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మౌనిక (ఫైల్)

మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం ఒకటవ సచివాలయం మహిళా పోలీస్ తాటిపాముల మౌనిక (24) ఆకస్మికంగా మృతి చెందారు. ఆమెకు భర్త, ఒక కుమార్తె, కుమారుడు కలరు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మౌనిక తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మౌనిక ఆరోగ్యం మరింత క్షీణించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హుటాహుటీన హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. మహిళా కానిస్టేబుల్ మృతి వార్త తెలుసుకున్న సచివాలయ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బాజీబాబా దర్గా ఈవోగా ఖాజా మస్తాన్

ప్రజాశక్తి - పెదకాకాని



ఈవో ఖాజా మస్తాన్

మండల కేంద్రమైన పెదకాకానిలోని బాజీ బాబా దర్గా నూతన ఈవోగా ఖాజా మస్తాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత మూడు సంవత్సరాలుగా ఈవోగా పని చేసిన ముక్తార్ భాష సాధారణ బదిలీపై కర్నూలు జిల్లాకు కేటాయించబడ్డారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో దర్గా అభివఅద్ధి కోసం దాతలతో కలిసి మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎప్పుడు లేని విధంగా దర్గా ఆదాయం కూడా పెంచడం జరిగిందని ఆయన తెలియజేశారు. దర్గా అభివఅద్ధి కోసం తన వంతు కఅషి చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఖాజా మస్తాన్ తెలియజేశారు.

శాఖమూరులో నీటి కుళాయిల ఏర్పాటుకు శ్రీకారం

ప్రజాశక్తి - తుళ్లూరు



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం శాఖమూరులో నీటి కుళాయిల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. నీటి కుళాయిల ఏర్పాటుకు పంచాయతీ నిధులను హెచ్చిస్తున్నారు. మాజీ సర్పంచ్‌లు కాకుమాను చెన్నకేశవరావు, ఆర్ధల సదాశివరావు కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన పనులకు శనివారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో జిల్లా ఐ టిడిపి అధ్యక్షులు తలతోటి సురేంద్ర, వలపర్ల విజయేంద్ర రావు, దళిత జెఎసి నాయకులు వలపర్ల ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.


సిడిపిఓ కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, పని భారం తగ్గించాలని, ఒకే యాప్ లో ఉండాలని కోరుతూ ఈనెల 23వ తేదీన గుంటూరు కలెక్ట్రేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మంగళగిరి ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓకు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా జులై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును అందజేశారు. సమ్మెలో మాత్రం అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్ర మంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హేమలత, సావిత్రి పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న సెక్రటరీ

ఎన్ఐటిలో గురవయ్య కాలేజి విద్యార్థికి సీటు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య ఇంటర్ విద్యార్థి పాల్ రియాన్ జెఇఇ మెయిన్స్‌లో అర్హత పొంది, ఎన్ఐటిలో సీటు సాధించటం కళాశా లకు గర్వకారణం అని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కళాశాలలో పాల్ రియాన్‌ను కార్యదర్శి ముత్యాలు, అధ్యక్షులు గుడివాడ రూపచందర్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో కార్పొరేట్ కళాశాలలు పోటీపడే జేఈఈ పరీక్షలలో ఎన్ఐటి సీటు సాధించటం అభినందనీయం అన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో బదిలీలకు మార్గదర్శకాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - గుంటూరు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు సాధారణ బదిలీల మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ నాగబ్రహ్మాచారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిందని, అయితే విద్యుత్ సంస్థలలో బదిలీలకు మార్గదర్శికాలు నేటికీ జారీ చేయలేదని తెలిపారు. బదిలీ కోసం ఎదురుచూసే ఉద్యోగులకు నిరాశ మిగులుతుందన్నారు. కాబట్టి వెంటనే విద్యుత్ సంస్థలలో బదిలీలకు మార్గదర్శకాలు జారీచేయాలని ఆయన కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - కొల్లిపర


తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు పురుగు మందులు ఎరువులు అమ్మినచో కఠిన చర్యలు తప్పవు అని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కొల్లిపర మండలంలోని వితనా లు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు డీలర్ సంతకం ఉన్న బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని, బిల్లును పంట కాలం పూర్తయ్యేవరకు జాగ్రత్త పరుచుకొనవలెనని ఆయన తెలిపారు. డీలర్స్ నకిలీ విత్తనాలు అమ్మినచో కట్టినచర్యలు తీసుకుంటామని, లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. కొల్లిపర మున్నంగి గ్రామంలోని లోని విత్తనాలు షాపులను తనిఖీ నిర్వహించి స్టాక్‌ను బిల్లులను పరిశీలించారు


తరగతి గదుల బయట వరండాలో మూడు, నాలుగు తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు


బాత్రూం గదుల దగ్గర తాగునీటి కుళాయిలు

మోడల్ పాఠశాల

- కనీస సౌకర్యాలు మృగ్యం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కనీస ససౌకర్యాలు లేక మండలంలోని మోడల్ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలోని ఎల్ఈ పాఠశాల కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మోడల్ స్కూలుగా గుర్తించారు. అయితే పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు కూడా వచ్చారు. పాఠశాలలో దాదాపు 81 మంది విద్యార్దులు ఉన్నారు. కానీ విద్యార్దులు కూర్చోవడానికి తరగతి గదులు లేవు ఆ పాఠశాల లో రెండు గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఐదవ తరగతి విద్యార్థులకు ఒక గది ఉండగా ఒకటి రెండు తరగతికి సంబంధించి ఒక తరగతి గది అంటే అందులో ఇద్దరు టీచర్లు ఉంటారు మరి విద్యార్దులకు పాఠాలు ఎలా చెప్తారో వారికే ఎరుక మూడు నాలుగు తరగతులకు అయితే వరండాలో టేబుల్స్ వేసి ఒక వైపు మూడవ తరగతి మరొక వైపు నాల్గవ తరగతి విద్యార్థులు టేబుల్స్‌పై కూర్చున్నారు. వారికి కూడా టీచర్లు చెరొక వైపు ఉంటారు అలా పాఠాలు చెప్తే విద్యార్దులకు ఏ విధంగా అర్థం అవుతుందో వారికే తెలియాలి.విద్యార్దులు కనీసం ఆటలు ఆడుకోవాలి అన్న మైదానం కూడా లేదు త్రాగునీరు కుళాయిలు పెట్టుకోవటానికి స్తలం లేక బాత్రూం గదులకు వెళ్ళే సందులో పెట్టుకోవాల్సిన పరిస్తితి ఏర్పడింది ఇలాగైతే విద్యార్దులు తరగతి గదులు లేక ఒక వైపు చదువుకు ఆటల మైదానం కూడా లేక పోవడంతో విద్యార్థులు రెండిటికి దూరం అవుతున్నారు అని తల్లితండ్రులు చెబుతున్నారు.

ఘనంగా తులసి రామచంద్రప్రభు, కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు


తులసి రామచంద్రప్రభుకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నసీర్

ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్రప్రభు, ఆయన కుమారుడు తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు శనివారం రాజకీయ నాయకులు, పారి శ్రామిక వేత్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో తమ కుమారులు తులసి యోగిష్, తులసి కృష్ణచైతన్య, మనవడు తులసి ఆదిత్య సమక్షంలో బర్త్ డే కేక్‌ను రామచంద్ర ప్రభు కట్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరై పూలదండలతో, పుష్పగుచ్చాలతో, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, సుప్రీం సర్జికల్స్ జవహర్ ఇతర ప్రముఖులు పాల్గని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఆత్మీయుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మిదుర్గ, వాసు, భవిరిశెట్టి మల్లికార్జునరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ, యర్రగోపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి : విద్యాసాగర్

ప్రజాశక్తి - గుంటూరు


విద్యాసాగర్, రమణను సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఎపిజెఎసి, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. గతంలో కోల్పోయిన రాయితీలు సాధించుకోవటంతోపాటు, కొత్తగా పొందాల్సిన రాయితీలు, హక్కుల కోసం రాబోయే కాలంలో ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తాలూకా లోని పెన్షనర్స్ హోంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన ఎ.విద్యాసాగర్, డి.వి.రమణ అభినందన సభ నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. ప్రభుత్వానికి హనీమూన్ పిరియడ్ అయిపోయిందని, ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. పెన్షనర్స్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. వెంటేశ్వర్లు, జి.ప్రభుదాసు, పెన్షనర్స్ అసోసియేషన్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కరీం, అడ్వైజర్లు డి.డి.ప్రసాదరావు, పి.అప్పారావు, దాలి నాయుడు, స్టేట్ ట్రెజరర్ ఎన్‌విస్ రాయుడు, ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాలిలో దీపంలా పంటల విక్రయాలు


వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నా పాలకులు ఏ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రధాన పంటలు సాగు చేస్తున్న రైతులంతా తగిన గిట్టుబాటు ధరలు దక్కక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వరి,పత్తి, మిరప,పొగాకు,అపరాలు, జన్న , మొక్క జన్న తదితర పంటలకి కనీస మద్దతు ధరలు లభించక రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ లో ఎదురైన ఇబ్బందులు రబీ సీజన్ లోనూ ఎదురయ్యాయి. ఒక వైపు ప్రకఅతి వైపరీత్యాలు, మరో వైపు చీడ పీడల ప్రభావంతో రెండు సీజన్ ల లోనూ రైతులు అల్లాడిపోయారు. చివరికి పొగాకు సాగు చేసిన రైతులు ఒకే రోజు ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జిల్లాలో కలకలం రేపాయి. ఈ ఘటన తరువాత సిఎం చంద్రబాబు నాయుడు ఎట్టకేలకు స్పందించి అధికార యంత్రాంగాన్ని కదిలించారు. బర్లీ పొగాకు కొనుగోలుకు గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించారు. ఐదు నెలల క్రితం ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ ఏర్పాటు అయ్యాయని రైతులు పెదవి విరుస్తున్నారు. ఫిబ్రవరిలో కొనుగోలు ప్రారంభం కావాలి. జూన్ చివరికి దాదాపుగా కొనుగోలు ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం పొగాకు రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. అలాగే మిర్చి విషయంలో కూడా ప్రభుత్వం రైతులను ఏమాత్రం ఆదుకోకుండానే సీజన్ ముగిసింది. ఈ ఏడాది మిర్చి రైతులు ఒక్కొక్కరు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. ప్రభుత్వం రూ.11,781 కన్నా ధర తగ్గితే ఆదుకుంటామని చెప్పినా ఒక్క రైతును కూడా ఆదుకోలేదు. రైతులకు సాయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితం అయ్యాయి. 2019 నుంచి 2024 వరకు క్వింటాలు కనిష్టంగా రూ.18 వేలు, గరిష్టంగా రూ.28 వేల వరకు ధరలు లభించాయి. కానీ ఈ ఏడాది కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు మాత్రమే లభించినా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం ద్వారా ప్రభుత్వం రెతులను ఆదుకోలేదు. ఈ ఏడాది జనవరి నుంచి మే 15 వరకు ధరలు లేక రైతులు పలు మార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. పెట్టుబడులు భారీగా పెరిగి ధరలు పడిపోవడంతో మిర్చి రైతులు ఈ ఏడాది భారీగా నష్టపోయారు. ఎకరాకు రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు ధర లేక ఒక్కొ రైతుకు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. వ్యాపారులు సిండికేట్ అయి ధరలు తగ్గించినా యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషించింది. ఎగుమతులు లేవని సాకు చెప్పి ధరలు తగ్గించేశారు. ఈ ఏడాది కూడా భారీగా ఎగుమతి అవకాశాలు వచ్చాయి. అలాగే జనవరి నుంచి మార్చి వరకు ధాన్యం రైతులు కూడా అయినకాడికి అమ్ముకున్నారు. వరికి 75 కేజీల బస్తా రూ.1750కి కొనుగోలు చేయాల్సి ఉండగా ఖరీఫ్ లో తొలుత బస్తా రూ. 1200 నుంచి రూ.1400 దక్కింది. అలాగే అష్ట కష్టాలు పడి పండించిన పత్తి పంటను అమ్ముకోవడానికి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పత్తి కొనుగోళ్ల లో రైతులకు తీవ్ర జరిగింది. పత్తి దిగుబడులు మార్కెట్లోకి వచ్చేవరకు కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా తీవ్ర జాప్యం చేశారు. ఇళ్లలో నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు అయిన కాడికి అమ్ముకున్నారు. జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కనీస మద్దతు ధర క్వింటాలు రూ.7521 ధర ఉండగా రూ. 2వేలు తక్కువగానే రైతులకి ధర లభించింది. రైతుల వద్ద పత్తి వారి కొనుగోలు పూర్తయిన తర్వాత మార్కెట్లో ధరలు పెరగడం విశేషం. ఖరీఫ్, రబీలో పండించిన అన్ని రకాల అపరాలు పంటలకు కనీస మద్దతు ధరలు లభించలేదు. మినుము, పెసర, శెనగ, కంది పంటలకి గత ఏడాది కన్నా ఏడాది క్వింటాలకు రూ. 1000 నుంచి 3000 రూపాయల వరకు తగ్గాయి. ఈ ఏడాది ఏ పంట పండించిన రైతులకు కూడా గిట్టుబాటు ధరలు కాదుకదా కనీసం ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఏర్పడినా వ్యాపారులు సిండికేట్ అయి రైతులను నష్టపరిచారు. పాలకులు,ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సకాలంలో జోక్యం చేసుకోకపోవడం వల్ల రైతులు ఒక్కొక్కరు రూ.లక్షకు పైగా నష్టపోవాల్సి వచ్చింది.

(ఎ.వి.డి.శర్మ)